రాజేంద్రనగర్ రోడ్డుకు మరమ్మతులు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న పవన్ సాయి తదితరులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఏఆర్ఐ గేటు నుంచి కిస్మత్‌పూర్‌కు వెళ్లేందుకు ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేయాలలని బీజేపీ నాయకుడు నీరుడు పవన్‌సాయి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ రఘురాం రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పవన్ సాయి మాట్లాడుతూ.. ఇస్లాపూర్‌తో పాటు బుద్వేల్, న్యూ గ్రీన్ సిటీ, కిష్టమ్మ గుట్ట తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో పని చేసి చేస్తారన్నారు. వీరితో పాటు విద్యార్థులు ఈ దారి గుండా రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఈ రహదారి కొంత భాగం పూర్తిగా గోతులమయంగా మారిందన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరు నిలువ ఉండి రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందన్నారు. యూనివర్సిటీకి చెందిన ఈ స్థానంలో ఇతరులెవ్వరూ అభివృద్ధి పనులు చేసేందుకు ఆస్కారం లేదన్నారు. దీంతో తాము రిజిస్ట్రార్‌ను కలిసి సమస్యను వివరించామని తెలిపారు. అందుకు సానుకూలంగా స్పందించారన్నారు. ఆయనతో పాటు శ్రీశైలం, క్యాతం సందీప్, ఉదయ్, కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ఆదరించాలి: రేఖయాదగిరి


కేక్ కటింగ్ చేసిన అతిథులు, బాలలు

మణికొండ: తల్లిదండ్రులు లేని పిల్లలను ఆదరించి వారిని ఇంటి వాతావరణంలో పెంచి పెద్ద చేస్తున్న ఎస్ఓఎస్ సంస్థ సేవలు ఎనలేనివని నార్సింగి మున్సిపాలిటీ మాజీ చైర్‌పర్సన్, గొలిదొడ్డి కౌన్సిలర్ డి.రేఖయాదగిరి అన్నారు. వట్టినాగులపల్లి శివారులోని ఎస్ఓఎస్ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ హెర్మన్ మైనర్ జయంతి సందర్భంగా ఎస్ఓఎస్ బాలల గ్రామంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. సమాజంలో అనాథలుగా ఉన్న బాలలను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పకపోతే వారు సమాజానికి విరుద్ధంగా తయారవుతారన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు నీరజ మాట్లాడుతూ..దేశానికి అత్యున్నత ఆస్తి పిల్లలు, వారి పరిరక్షణ, ఉన్నత మార్గంలో పయనింప చేయటమేనన్నారు. మరో సభ్యురాలు ముంతాజ్ మాట్లాడుతూ..తల్లిదండ్రులు కోల్పోయిన ప్లిలలను అన్నీ తామై వారి అభివృద్ధికి తోడ్పడుతున్న ఎస్ఓఎస్ సేవలు అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ విలేజ్ డైరెక్టర్ గౌరీప్రసన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఉత్సవాలు జరుపుకున్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

వైభవంగా బొడ్రాయి వార్షికోత్సవ ఉత్సవాలు


కోకాపేట బొడ్రాయి పూజల్లో పాల్గొన్న నాయకులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట గ్రామంలో ఆదివారం బొడ్రాయి వార్షికోత్సవ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గత సంవత్సరం గ్రామంలో పురాతన బొడ్రాయి స్థానంలో కొత్తది ప్రతిష్ఠాపన చేశారు. ప్రతి సంవత్సరం దానికి ఘనంగా పూజలు నిర్వహించి గ్రామస్తులందరినీ సుఖ సంతోషాలతో ఉంచాలని కోరుకుంటారు. అందులో భాగంగా ఉదయం నుంచే గ్రామస్తులు నైవేద్యాలు, సాకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జి.విజయ్‌బాబు, కౌన్సిలర్ దుర్గేష్‌యాదవ్ పాల్గొన్నారు.

డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ సేవలు ఎనలేనివి


నార్సింగిలో శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


హైదర్‌గూడలో నివాళులర్పిస్తున్న నాయకులు

మణికొండ: జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలు ఎనలేనివని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అంజన్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన వర్ధంతిని పురస్కరించుకుని బీజేపీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు సీహెచ్. భిక్షపతియాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ, కోకాపేట కౌన్సిలర్ ఆర్. ఆదిత్యరెడ్డి, జిల్లా కన్వీనర్ మల్లేష్‌యాదవ్, నాయకులు సుధాకర్, ఎం.నగేష్‌యాదవ్, జైపాల్‌రెడ్డి, డి.కృష్ణ, జి.శివారాజ్, రాజ్‌కిరణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌గూడలో..

అత్తాపూర్: హైదర్‌గూడలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మొంద్ర సంగీత గౌరీశంకర్, జిల్లా కార్యదర్శి కొమరయ్య, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్, సుధాకర్, నరసింహ, శభాద విజయ్, వెంకటేష్, రమేష్, జయనంద్ రెడ్డి, రావుల జగన్, కృష్ణ, బాలకృష్ణ, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్ డివిజన్ అభివృద్ధికి కృషి: కిషన్‌రెడ్డి


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో బీజేపీ నాయకుడు దేవర వంశీ తదితరులు

గోల్కొండ: గుడిమల్కాపూర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం గుడిమల్కాపూర్ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు ఆయనను కలిశారు. కేంద్ర మంత్రిగా మళ్లీ మరోసారి నియమితులైన సందర్భంగా ఆయనను అభినందించారు. ఈసందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ..పార్లమెంటు సమావేశాల అనంతరం గుడిమల్కాపూర్ డివిజన్‌లో పర్యటించి ప్రజలను కలుసుకుంటానన్నారు. సికింద్రాబాద్ నుంచి తనను గెలిపించిన ఓటర్లకు తాను ఎప్పుడు రుణపడి ఉంటానన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్ఎస్ పార్టీని గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు గట్టి గుణపాఠం నేర్పారని ఆయన పేర్కొన్నారు. అవకతవక విధానాలతో రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ సైతం భూస్థాపితం కావడం ఖాయమన్నారు. బండారి శ్రీనివాస్, అనిల్‌కుమార్ తదితరులున్నారు.

కులమతాలకతీతంగా హైదరాబాద్ అభివృద్ధి



చార్మినార్: కులమతాలకతీతంగా హైదరాబాద్ అభివృద్ధి జరుగుతోందని.. ఇందుకు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కృషి ఎంతో ఉందని మహ్మద్ క్యాప్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇలియాస్ బుకారీ అన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులుగా 5వ సారి భారీ మెజార్టీతో విజయం సాధించిన మజ్లిస్ పార్టీ చీఫ్ అసదుద్దీన్ ఒవైసీని ఆయన ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇలియాస్ బుకారీ మాట్లాడుతూ..ఈ నెల 24న ఎంపీగా బాధ్యతలు చేపట్టనున్న సందర్భంగా అసదుద్దీన్ ఒవైసీని కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు తెలిపారు. హైదరాబాద్ నగరానికి ఎంతో ప్రాధాన్యత, ప్రత్యేకత ఉందని.. చారిత్రాత్మకమైన నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరుగుతోందన్నారు.

విలీనమా..? పురపాలనేనా..!

- గ్రేటర్‌లో మున్సిపాలిటీ విలీనంపైనే జోరుగా చర్చలు
- రాజకీయ భవిష్యత్తుకు చెక్ పడుతుందని నేతల ఆందోళన
- పంచాయతీలుగా ఉన్న సమయంలో గ్రేటర్‌లో విలీనానికి ప్రయత్నం
- కోర్టుకెళ్లి అడ్డుకున్న నేతలు



శంషాబాద్ మున్సిపాలిటీ

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీని గ్రేటర్ హైదరాబాద్‌లో విలీన అంశం ఇప్పుడు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. పంచాయతీలుగా ఉన్న సమయంలోనే అప్పటి ప్రభుత్వాలు గ్రేటర్‌లో విలీనం చేసేందుకు వేసిన అడుగులను స్థానిక నేతలు న్యాయస్థానికి వెళ్లి అడ్డుకున్నారు. మొత్తం మీద 2019లో మార్చిలో శంషాబాద్ గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా అవతరించింది. ఇందులో శంషాబాద్ మేజర్ గ్రామపంచాయతీతో పాటు సమీపంలోని సాతంరాయి, కొత్వాల్‌గూడ, ఊటీపల్లి, తొండుపల్లి, గొల్లపల్లి గ్రామాలతో కలుపుకుని మున్సిపాలిటీని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత 2020 జనవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికలతో తొలి పాలకవర్గం కొలువుదీరింది.

ఆరు నెలల తర్వాత..

ప్రస్తుత పాలకవర్గ సమయం మరో ఆరు నెలలు మాత్రమే ఉంది. పాలకవర్గ కాలం పూర్తయిన తర్వాత శివారులోని ఇతర మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లతో కలుపుకుని హైదరాబాద్ మహానగరాన్ని మరింత విస్తరించేందుకు ప్రభుత్వం సంకల్పంగా ఉన్నట్లు ఇటీవల అనేకమార్లు అభిప్రాయాలను వెల్లడించింది. ఔటర్‌లోపల ఉండి గ్రామపంచాయతీలుగా ఉన్న నాలుగు గ్రామాలను కూడా శంషాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేసే అంశాలపై ఇటీవల డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి సంబంధిత గ్రామపంచాయతీల అధికారులకు లిఖిత పూర్వ ఆదేశాలు కూడా అందాయి. సమీప గ్రామాల విలీన ప్రక్రియ పూర్తయిన అనంతరం మహానగర విస్తరణకు అడుగులు వేసే ఆలోచనల్లో సర్కారు ఉన్నట్లు సమాచారం.

అదే జరిగితే..

శంషాబాద్ మున్సిపాలిటీలో 2010 జనాభా లెక్కల ప్రకారం 44 వేలు మాత్రమే కానీ ప్రస్తుతం లక్షకు చెరువులో జనాభా ఉంది. ప్రస్తుతం 25 వార్డులకు కౌన్సిలర్లుగా ఎన్నికైన వారు ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్నారు. గ్రేటర్‌లో విలీనం జరిగితే పట్టణంలోని ఓటర్ల సంఖ్య ఆధారంగా రెండు కార్పొరేటర్ డివిజన్‌లుగా మారేందుకు అవకాశం ఉంటుంది. దీంతో రాజకీయ భవిష్యత్తుపై కొందరికి ఈ నిర్ణయం గొడ్డలి పెట్టునే మారనుందనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. ఈ విషయమై ప్రభుత్వం తీసుకునే కచ్చితమైన నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. గ్రేటర్ విలీనంతో అభివృద్ధి వేగం పుంజుకుంటుదా..? లేదా ప్రజలకు ప్రజాప్రతినిధులకు దూరం పెరిగి మరింత కుంటుపడుతుందా అని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు. మరో మారైనా పురపాలన కొనసాగితే బాగుంటుందని అభిప్రాయం అత్యధికుల్లో ఉన్నా.. గ్రేటర్ విలీనంతోనే అభివృద్ధి సాధ్యమని మరి కొందరు భావిస్తున్నారు. గత సర్కారు చేసిన పురపాలన చట్టాన్ని సవరించి రిజర్వేషన్ల ప్రక్రియను మార్చి మరోమారు ఎన్నికలు జరపాలన మరికొందరు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

> **పౌరసేవలకు ఇబ్బంది..**
>
> 
>
> మున్సిపాలిటీనీ గ్రేటర్‌లో విలీనం చేస్తే బస్తీల్లో మౌలిక సమస్యల పరిష్కారం సమస్యగా మారుతుంది. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండే ప్రజాప్రతినిధుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతే సమస్యల పరిష్కారం జఠిలంగా మారుతుంది. పంచాయతీల నుంచి మున్సిపాలిటీ మారిన తర్వాత కనీసం రెండులేదా మూడు పర్యాయాలైన కొనసాగించి అభివృద్ధిలోకి తెచ్చిన తర్వాత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే మంచిది.
>
> – తోకల మురళీయాదవ్, శంషాబాద్

పొదుపుతోనే ప్రతి కుటుంబ ఆర్థికాభివృద్ధి సాధ్యం


సత్యసాయి పొదుపు సంఘ నూతన సభ్యులు

రాజేంద్రనగర్: పొదుపుతోనే ప్రతి కుటుంబ ఆర్థికాభివృద్ధి సాధ్యమని సత్యసాయి పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం లిమిటెడ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దె యాదగిరి, అధ్యక్షుడు పగిడిమర్రి సూర్య నారాయణ అన్నారు. పొదుపు సంఘం నిర్వాహణలో పాలకవర్గ సభ్యులు సమష్టిగా సంఘాభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని మార్కండేయనగర్‌లో సత్యసాయి పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం 24వ వార్షిక సర్వసభ్య సమావేశం సంఘం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2000 సంవత్సరంలో 20 మంది సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన తమ సంఘం ప్రస్తుతం 626 మంది సభ్యులతో రూ.4 కోట్ల 44 లక్షల టర్నోవర్‌తో కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు సత్యనారాయణ, పగిడిమర్రి వాసు, ఉపాధ్యక్షులు మునగపాటి విష్ణు, ప్రధాన కార్యదర్శి కోట శ్యామ్ కుమార్, సహాయ కార్యదర్శి కర్నాటి శ్రీనివాస్, కోశాధికారి కోట పవన్ కుమార్, పాలకవర్గ సభ్యులు విడెం రమేశ్, కై రంకొండ శంకర్, శిరందాసు నరేందర్, గంజి నరేశ్, బాత్కు విజయ్ కుమార్, బూసం భానుచందర్, గంజి ధనుంజయ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం...

సత్యసాయి పొదుపు సంఘం వార్షిక సభ అనంతరం పదవీకాలం ముగిసిన సభ్యులకు అడిట్ వెంకటేశ్, సలహాదారుల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అనంతరం పాలకవర్గ సభ్యులుగా ఎన్నికైన సభ్యులు నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా సూర్యనారాయణను మరోమారు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కోటశ్యామ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా మునగపాటి విష్ణును ఎన్నుకోగా వర్గ సభ్యులుగా విడెం రమేశ్, కైరంకొండ శంకర్, శిరందాసు నరేందర్, గంజి నరేశ్, కంది అశోక్, బాత్కు విజయ్ కుమార్, బూసం భానుచందర్, గంజి ధనుంజయ్ కొనసాగుతారని ఎన్నికల అధికారి, అడిటర్ వెంకటేశ్ వెల్లడించారు. సలహాదారులుగా గద్దె యాదగిరి, ఏర్వ సత్యనారాయణ, గద్దె కృష్ణ, పగిడిమర్రి వాసు వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.

సన్మానం


రాందాస్ ముదిరాజ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ జేపీ దర్గాలో నాజ్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మైలార్‌దేవ్‌పల్లిలోని అమ్మా గార్డెన్‌లో ప్రజలకు పెద్ద ఎత్తున భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడకు పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్ పాల్గొన్నారు. రాందాస్ ముదిరాజ్ జన్మదినాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ భారీ కేక్‌ను కట్ చేయించి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తలారి మల్లేష్ ముదిరాజ్, మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, నార్సింగి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, చేవెళ్ల యాదిరెడ్డి, కుమార్‌గౌడ్, దశరథ్‌గౌడ్ తదితరులున్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం


పుల్లారెడ్డిని సన్మానిస్తున్న ప్రణవభక్త సమాజం సభ్యులు

అత్తాపూర్: మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి నారేగూడెం మల్లారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు మొంద్ర కొమురయ్య, షాబాద్ విజయ్‌కుమార్ అన్నారు. అత్తాపూర్ గ్రామానికి చెందిన గంగిడి పుల్లారెడ్డి(53) 25 ఏళ్లుగా దేశవ్యాప్తంగా జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటూ విజయాలు సాధిస్తూ తమ గ్రామానికి పేరు తీసుకురావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బాల్యం నుంచే క్రీడలపై దృష్టి సారించేలా పాఠశాల యజమాన్యాలు తల్లిదండ్రులు చూడాలని కోరారు. అనంతరం ప్రణవభక్త సమాజం పుల్లారెడ్డిని ఘనంగా సన్మానించింది.

సర్కిల్ కార్యాలయంలో నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమాన్ని సర్కిల్ కార్యాలయంలోని మొదటి అంతస్తు మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది హాజరవుతారని తెలిపారు. అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ ప్రజావాణి కార్యక్రమానికి హాజరై అధికారులకు వివరించాలని తెలిపారు.

నేడు పోతులూరి వీరబ్రహ్మం మఠం 22వ వార్షికోత్సవం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్‌లోని పోతులూరి వీరబ్రహ్మం మఠం 22వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు మఠం నిర్వాహకులు తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా మఠం ఆవరణలో ఉదయం 11.30 గంటలకు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందామాంబ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై తిలకించాలని కోరారు.

తల్లీ, పిల్లల అదృశ్యం


మమత


భానుప్రసాద్, వైష్ణవి

శంషాబాద్ రూరల్: తల్లీ, పిల్లలు అదృశ్యమైన ఘటన పెద్దతూప్రలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దిద్యాల యాదయ్య ఈ నెల 19న ఉదయం పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చే వరకు ఇంట్లో భార్య మమత, కుమారుడు భానుప్రసాద్(10), కూతురు వైష్ణవి(7) కనిపించలేదు. వారి గురించి వాకబు చేయగా ఉదయం స్కూలు బస్సు ఎక్కి ముగ్గురు వెళ్లినట్లు యాదయ్య తల్లి చెప్పింది. తర్వాత వారి ఆచూకీ కోసం అన్ని చోట్ల వెతికినా లభించలేదు. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి


మాట్లాడుతున్న నీరటి మల్లేష్

రాజేంద్రనగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇల్లు లేని పేదలను దృష్టిలో ఉంచుకొని వెంటనే స్పందించి ఎక్కడికక్కడ పేదలను గుర్తించి ఇంటి స్థలాలు, ఇళ్లను నిర్మించి ఇవ్వాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు నీరటి మల్లేష్ డిమాండ్ చేశారు. ఆదివారం కాటేదాన్‌లోని సీపీఎం పార్టీ నియోజకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శంషాబాద్, రాజేంద్రనగర్, గండిపేట్ మండలాలలో నివసించే పేదలకు, ఇల్లు లేని వారికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇ.పవన్ కుమార్ స్వామి, రామ్మోహన్, జంగయ్య, మోహన్, అనురాధ, సువార్త, జయమ్మ, గణేష్, లావణ్య, గట్టయ్య పాల్గొన్నారు.

వెంకట్‌రెడ్డికి సత్కారం


వెంకట్‌రెడ్డిని సత్కరిస్తున్న స్నేహితులు

శంషాబాద్: రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమితులైన శీలం వెంకటర్‌రెడ్డికి ఆయన స్నేహితులు ఆదివారం ఘనంగా సన్మానించారు. శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో సంకూరి జయప్రకాష్, బొల్లోజి నర్సింహచారి, భాగ్యలక్ష్మి, మంజుల, సరితారెడ్డి, డాక్టర్ కృష్ణ, సారంగ కిరణ్ కుమార్, గుర్రం ధన్‌రాజ్, సాయిబాబా, మహిపాల్‌రెడ్డి, దాసరి సత్యనారాయణ, తడబోయిన నర్సింహ, యూసుఫ్, ఖదీర్, రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, బాల్‌రాజ్, సురేష్, యాదగిరి, అంజయ్య, మహేందర్, జగన్, చందు, కొమరయ్య, చేపూరి యాదగిరి , దాసు, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

భారీ వర్షం.. రోడ్లు జలమయం


రహదారులపై చేరిన వర్షపు నీరు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కారణంగా ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీలలో వరద నీరు నిలిచిపోవడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సర్కిల్ పరిధిలోని ఉప్పర్‌పల్లి, శివరాంపల్లి, ఆరాంఘర్, నేషనల్ పోలీసు అకాడమీ రహదారులపై వర్షపు నీరు నిలవడంతో జీహెచ్ఎంసీ సిబ్బంది వెంటనే స్పందించి వరదనీరు వెళ్లేలా చర్యలు చేపట్టారు. రాజేంద్రనగర్‌లోని ఓ చెట్టు కొమ్మ విద్యుత్ వైర్లపై పడటంతో అంతరాయం ఏర్పడింది. సిబ్బంది వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టారు.

ఘనంగా వీరభద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు, కమిటీ సభ్యులు


అన్నదానంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్ ప్రధాన రహదారిపై వెలిసిన వీరభద్ర స్వామి ఆలయ రెండో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారి అభిషేకంతో పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. పూజ అనంతరం గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బండ్లగూడకు చెందిన జై భవానీ భజన మండలి శివరాం బృందం ఆలపించిన భక్తి గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భజన మండలి బృందంతో పాటు స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళ భక్తులు ఈ భజనలో పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా దేవాలయాన్ని చూడముచ్చటగా అలంకరించారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేపట్టారు.